కాబోయే అమ్మకు కాంస్యం

కడుపులో ఏడు నెలల చిన్నారితో పారాలింపిక్స్ బరిలోకి దిగిన ఇంగ్లండ్ మహిళా పారా ఆర్చర్ జోడీ గ్రిన్హమ్ కాంస్య పతకం సాధించి చరిత్ర సృష్టించింది. మహిళల వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్‌లో గ్రిన్హమ్ 142-141 స్కోరుతో తన ప్రత్యర్థి పీటర్సన్ పైన్‌ను ఓడించింది. తద్వారా ఈ పారాలింపిక్స్‌లో పతకం గెలిచిన తొలి గర్భిణీగా రికార్డులకెక్కింది. 2016లో ఆమె రజతం నెగ్గింది.

షట్లర్ల దూకుడు

పారా బ్యాడ్మింటన్‌లో భారత్‌కు మూడు పతకాలు పక్కా

ఫైనల్ చేరిన నితేశ్, యతిరాజ్ • సెమీస్‌లో తలపడనున్న మనీష, తులసిమతి • ఆర్చరీలో మెరిసిన రాకేశ్ కుమార్

పారాలింపిక్స్‌లో భారత పారా షట్లర్లు జోరు కొనసాగిస్తున్నారు. తొలి రెండు రోజుల్లో భారత షూటర్లు దేశానికి నాలుగు పతకాలు అందించగా తాజాగా షట్లర్లు సైతం మరో మూడు పతకాలు ఖాయం చేశారు. పురుషుల విభాగంలో నితేశ్ కుమార్, యతిరాజ్ ఫైనల్స్ చేరడంతో స్వర్ణం లేదా రజతం తెచ్చేందుకు సిద్ధమయ్యారు. మహిళ ల విభాగంలో మనీష, తులసిమతి సెమీస్‌లో తలపడనుండటంతో ఎవరు గెలిచినా పతకం పక్కా అవనుంది. బ్యాడ్మింటన్‌తో పాటు ఆర్చరీలోనూ భారత్ సత్తా చాటగా మిగిలిన ఈవెంట్స్‌లో దేశానికి ఆశించిన ఫలితాలు రాలేదు.

నితేశ్

సుహాస్

పారిస్: పారాలింపిక్స్‌లో భారత పారా షట్లర్లు దేశానికి మూడు పతకాలు ఖాయం చేశారు. ఆదివారం జరిగిన బ్యాడ్మింటన్‌లోని వివిధ విభాగాల్లో మన షట్లర్లు దుమ్మురేపారు. పురుషుల సింగిల్స్ (ఎస్ఎల్3) సెమీస్‌లో కుమార్ నితేశ్.. 21-16, 21-16తో పుజిహర (జపాన్)ను ఓడించి ఫైనల్స్‌కు చేరాడు. మరో ఈవెంట్ పురుషుల సింగిల్స్ (ఎస్ఎల్4) సెమీస్‌లో సుహాస్ యతిరాజ్ 21-17, 21-12తో భారత్‌కే చెందిన సుకాంత్ కదమ్‌ను ఓడించి గోల్డ్ మెడల్ మ్యాచ్‌కు అర్హత సాధించాడు. ఈ ఇద్దరూ ఫైనల్స్‌లో గెలిస్తే దేశానికి రెండు స్వర్ణాలు అందించే అవకాశం ఉండగా ఓడినా కనీసం రజతాలు అయితే భారత్ ఖాతాలో చేరనున్నాయి. మహిళల విభాగాల్లోనూ భారత్‌కు పతకం దక్కే విజయాలే నమోదయ్యాయి. మహిళల సింగిల్స్ (ఎస్‌యూ5) క్వార్టర్స్ పోరులో మనీష రామదాస్ 21-13, 21-16తో మమికొ టొయొడ (జపాన్)ను ఓడించి సెమీస్ పోరుకు అర్హత సాధించింది. సెమీస్‌లో ఆమె భారత్‌కే చెందిన తులసిమతి మురుగేశన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ పోరులో గెలిచిన విజేత ఫైనల్స్‌కు చేరనుండగా ఓడిన వాళ్లు కాంస్య పోరులో ఆడతారు. మహిళల సింగిల్స్ (ఎస్‌హెచ్6) క్వార్టర్స్‌లో నిత్య శ్రీ సివన్ 21-4, 21-7తో ఒలివియా (పోలండ్)ను ఓడించి సెమీస్‌కు చేరింది.

కాంస్య పోరుకు రాకేశ్

మనీష

రాకేశ్

పురుషుల వ్యక్తిగత కాంపౌండ్‌లో ఒక్కో మెట్టు ఎక్కుతూ సెమీస్ చేరిన ఆర్చర్ రాకేశ్ కుమార్ కీలక పోరులో నిరాశపరిచాడు. సెమీస్‌లో రాకేశ్ 143-145తో జిన్లియాంగ్ (చైనా) చేతిలో ఓడాడు. సెమీస్‌లో ఓడటంతో అతడు కాంస్య పోరుకు అర్హత సాధించాడు. అంతకు ముందు ప్రిక్వార్టర్స్, క్వార్టర్స్‌లో షూటాఫ్ ద్వారా తేలిన ఫలితాలలో రాకేశ్ అదరగొట్టి ప్రత్యర్థులను చిత్తుచేశాడు.

షూటింగ్‌లో నిరాశ

రెండు రోజుల్లోనే దేశానికి నాలుగు పతకాలు అందించిన షూటర్లు ఆదివారం మాత్రం నిరాశపరిచారు. పారిస్‌లో ఇదివరకే పది మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్‌లో స్వర్ణం నెగ్గిన అవని లేఖరా ఆదివారం జరిగిన పది మీటర్ల ఎయిర్ రైఫిల్ ప్రోన్ (ఎస్‌హెచ్1) మిక్స్‌డ్ ఈవెంట్ క్వాలిఫికేషన్‌లో 11వ స్థానంలో నిలిచింది. ఇదే ఈవెంట్ మిక్స్‌డ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ప్రోన్ (ఎస్‌హెచ్2)లో శ్రీహర్ష రామకృష్ణ 26వ స్థానంలో నిలిచాడు. క్వాలిఫికేషన్ రౌండ్స్‌లో టాప్8 లో నిలిచినవారే ఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు.

అథ్లెటిక్స్‌లోనూ అంతంతే..

పారా అథ్లెటిక్స్‌లో షాట్‌పుటర్ రవి రంగోలి, రన్నర్ రక్షిత ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. పురుషుల షాట్‌పుట్ (ఎఫ్40) ఫైనల్‌లో రవి రంగోలి ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. రవి ఇనుపగుండును 10.63 మీటర్ల దూరం విసిరాడు. పోర్చుగల్‌కు చెందిన మొంటొరొ 11.21 మీటర్లతో స్వర్ణం దక్కించుకోగా మంగోలియా అథ్లెట్ బట్టుల్గ సెమిడ్ (11.9 మీటర్లు)కు రజతం దక్కింది. మహిళల 1500 మీటర్ల హీట్ (టీ11)లో పారా రన్నర్ రక్షిత ఐదో స్థానంలో నిలిచింది. రోయింగ్ మిక్స్‌డ్ పీఆర్3 డబుల్స్ స్కల్స్ ర్యాంకింగ్ రౌండ్స్‌లో భారత్ రెండో స్థానాన నిలిచింది. యూకే అగ్రస్థానాన్ని దక్కించుకుంది. టేబుల్ టెన్నిస్ మహిళల సింగిల్స్ క్లాస్4 కేటగిరీలో భావీన పటేల్ 3-0తో మార్తా వెర్డిన్ (మెక్సికొ)ను చిత్తు చేసి క్వార్టర్స్‌కు చేరింది.

మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో భారత క్రికెటర్లు

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా వేదికగా జరుగబోయే ప్రతిష్టాత్మక మహిళల బిగ్‌బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్)లో ఆరుగురు భారత క్రికెటర్లు ఆడనున్నారు. ఆదివారం వేలం ప్రక్రియ ముగియడంతో ఎవరెవరు ఏ జట్టుకు ఆడతారనేదానిపై స్పష్టత వచ్చింది. టీమ్‌ఇండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అడిలైడ్ స్ట్రైకర్స్‌కు ఆడనుండగా దయాలన్ హేమలత పెర్త్‌కు ప్రాతినిధ్యం వహించనుంది. యస్తికా భాటియా, దీప్తి శర్మ మెల్‌బోర్న్ స్టార్స్ తరఫున బరిలోకి దిగనుండగా ఆల్‌రౌండర్ శిఖా పాండే, స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ బ్రిస్బేన్ హీట్‌కు ఆడనున్నారు.

జగన్‌మోహన్‌రావుకు ప్రతిష్టాత్మక పురస్కారం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావుకు ఢిల్లీకి చెందిన స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మక పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఈ ఏడాదికి గాను 'బెస్ట్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్'గా జగన్‌మోహన్‌రావుకు అవార్డు దక్కింది. హ్యాండ్‌బాల్, క్రికెట్‌తో పాటు పలు క్రీడాంశాల్లో క్రీడాకారులకు ఆయన అందిస్తున్న ప్రోత్సాహం, క్రీడారంగ అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించిన ఫౌండేషన్ ఈ అవార్డును ప్రదానం చేసింది.

బంగ్లాను ఆదుకున్న లిటన్ దాస్

• **రాణించిన మెహిది హసన్ మిరాజ్**

రావల్పిండి: పాకిస్థాన్‌తో రావల్పిండి వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో బంగ్లాదేశ్ పట్టు బిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు వికెట్ కీపర్ బ్యాటర్ లిటన్ దాస్ (138) అద్భుత శతకానికి తోడు మెహిది హసన్ మిరాజ్ (78) సమయోచిత ఇన్నింగ్స్‌తో ఆదుకోవడంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 262 పరుగులకు ఆలౌట్ అయింది. ఒకదశలో 26 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన బంగ్లా ఇక్కడిదాకా వచ్చిందంటే అది లిటన్, మిరాజ్ పోరాటమే. పాకిస్థాన్ యువ పేస్ సంచలనం ఖుర్రం షాజాద్ (6/90) ఆరు వికెట్లతో బంగ్లా టాపార్డర్‌ను కుప్పకూల్చాడు. పర్యాటక జట్టు ఆలౌట్‌తో 8 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని దక్కించుకున్న పాకిస్థాన్.. మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 3.4 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ (3), నైట్ వాచ్‌మెన్ ఖుర్రంను హసన్ మహ్మూద్ పెవిలియన్‌కు పంపాడు.

ఇంటర్ కాంటినెంటల్ కప్‌నకు సర్వం సిద్ధం

పాల్గొననున్న భారత్, సిరియా, మారిషస్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నగరంలోని జీఎంసీ బాలయోగి స్టేడియం మరో అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నీకి ఆతిథ్యమివ్వబోతోంది. ఈ నెల 3 నుంచి 9 దాకా హైదరాబాద్ వేదికగా భారత్, మారిషస్, సిరియా ఇంటర్ కాంటినెంటల్ ఫుట్‌బాల్ కప్-2024 ఆడనున్నాయి. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఎఫ్) సమన్వయంతో ఈ టోర్నీని నిర్వహించనున్నాయి. ఫుట్‌బాల్‌లో హైదరాబాద్ నగరానికి ఉన్న ఘనమైన వారసత్వం దృష్ట్యా మళ్లీ ఈ క్రీడలో పునర్‌వైభవం తీసుకొచ్చేందుకు ఇంటర్ కాంటినెంటల్ కప్‌ను నిర్వహించనున్నట్టు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే. శివసేనారెడ్డి అన్నారు. ఈ టోర్నీని సజావుగా నిర్వహించేందుకు స్టేడియంలో అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసినట్టు ఆయన తెలిపారు. టోర్నీలో భాగంగా భారత్.. ఈనెల 3న మారిషస్‌తో 9న సిరియాతో తలపడనుంది. మారిషస్, సిరియా మధ్య 6న మ్యాచ్ జరుగనుంది.

ఇంగ్లండ్‌దే రెండో టెస్టు

లండన్: స్వదేశంలో శ్రీలంకతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను ఇంగ్లండ్ మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో చేజిక్కించుకుంది. లార్డ్స్ వేదికగా జరిగిన రెండో టెస్టులో 482 పరుగుల భారీ ఛేదనలో లంకేయులు 292 పరుగులకే ఆలౌట్ అవడంతో ఇంగ్లీష్ జట్టు 190 పరుగుల తేడాతో గెలుపొందింది. లంక తరఫున చండిమల్ (58), కరుణరత్నె (55), ధనంజయ డిసిల్వ (50) రాణించారు. గస్ అట్కిన్సన్ (5/62) దెబ్బకు లంక బ్యాటర్లు విలవిల్లాడారు.

పతకాల పట్టిక

	దే	స్వ	ర	కా	మొ
1	చైనా	27	23	10	60
2	బ్రిటన్	20	12	8	40
3	బ్రెజిల్	8	4	13	25
4	అమెరికా	6	10	6	22
5	ఫ్రాన్స్	6	7	10	23
6	ఆస్ట్రేలియా	6	5	9	20
26	భారత్	1	1	3	5

దే : దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

ప్రిక్వార్టర్స్‌కు సిన్నర్, స్వియాటెక్

న్యూయార్క్: టాప్ సీడ్‌లంతా ఒక్కొక్కరుగా వెనుదిరుగుతున్న యూఎస్ ఓపెన్‌లో ఇటలీ కుర్రాడు జన్నిక్ సిన్నర్ మాత్రం తన జోరు కొనసాగిస్తున్నాడు. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్ పోరులో ఒకటో సీడ్ సిన్నర్ 6-1, 6-4, 6-2తో క్రిస్ ఒ కనెల్ (ఆస్ట్రేలియా)ను ఓడించి ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. గంటా 53 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో సిన్నర్ 15 ఏస్‌లు సంధించగా 46 విన్నర్లు కొట్టాడు. గత రెండు రౌండ్‌లలో ఆరంభంలో కాస్త ఇబ్బందిపడ్డ సిన్నర్ ఈ మ్యాచ్‌లో మాత్రం ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించాడు. మరో మ్యాచ్‌లో డేనియల్ మెద్వెదెవ్ (రష్యా) 6-3, 6-4, 6-3తో ఫ్లేవియొ కొబొలి (ఇటలీ)ని వరుస సెట్లలో చిత్తుచేసి ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించాడు. యూఎస్ ఓపెన్ టాప్-10 సీడెడ్ ఆటగాళ్లలో సిన్నర్, మెద్వెదెవ్, జ్వెరెవ్ మాత్రమే ప్రిక్వార్టర్స్‌కు చేరడం గమనార్హం.

స్వియాటెక్, సబలెంక దూకుడు

మహిళల సింగిల్స్‌లో పోలండ్ సంచలనం ఇగా స్వియాటెక్‌తో పాటు బెలారస్ భామ అరీనా సబలెంక, ఇటలీ చిన్నది జాస్మిన్ పలోని ప్రిక్వార్టర్స్ చేరారు. మూడో రౌండ్‌లో స్వియాటెక్ 6-4, 6-2తో పవ్యూచెంకోవాను చిత్తుచేసింది. సబలెంక 6-2, 6-1, 6-2తో అలగ్జాండ్రొవను ఓడించగా వొజ్నియాకి 6-3, 6-2తో జెస్సిక పంచెట్ (ఫ్రాన్స్)పై గెలిచింది. కోకో గాఫ్, స్వియాటెక్, పలోని, సబలెంక, జెంగ్ వంటి స్టార్ ప్లేయర్లు ప్రిక్వార్టర్స్ చేరడంతో పోరు రసవత్తరం కానుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత ఆటగాడు రోహన్ బోపన్న జపాన్ సహచరిణి అల్లిల ద్వయం 0-6, 7-6 (7/5), 10-7తో జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా), కటెరిన సినియాకొవ (చెక్ రిపబ్లిక్)ను ఓడించి క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.